31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

ఆదివారం, జులై 26, 2026 పేజీలు : 8

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా...విద్యార్థుల విజయం

### -మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 25 :** నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యతగా తీసుకుంటూ కేంద్ర విద్యా శాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయడం రాజకీయాలకు అతీతంగా విద్యార్థుల ఉద్యమ విజయమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 28 రోజులుగా ప్రజాస్వామ్యయుతంగా జరిగిన విద్యార్థుల ఉద్యమంతోనే కేంద్రం దిగివచ్చి,విద్యార్థి నాయకులతో చర్చలు జరపడం,మంత్రి రాజీనామా చేయడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా కేటీఆర్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, లీకేజీకి బాధ్యులను శిక్షించే వరకు అండగా నిలబడుతారని తెలుపడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడిన ఒక్కో విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం అందించడమే కాకుండా, శాంతియుతంగా ఉద్యమించిన విద్యార్థులపై పెట్టిన కేసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజలకు పారదర్శక, సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి







### -జగిత్యాల పోలీసుల పనితీరు భేష్
### -బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 25:** ప్రజలకు చేరువయ్యేలా పారదర్శక, సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని జగిత్యాల పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందని బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్ పేర్కొన్నారు. బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్ శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం (డీపీఓ) తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్కు చేరుకున్న డీఐజీకి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ను సందర్శించి స్టేషన్ రికార్డులు, ఎస్ఐఆర్లు, కేసు డైరీలు, సీసీటీఎస్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో కేసులను విచారించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాట్టారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న వివిధ విభాగాలను సందర్శించారు. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో కార్యాలయాలను పరిశీలించి నిర్వహిస్తున్న రికార్డులు, డిజిటల్ డేటా నిర్వహణ, సమాచార సేకరణ విధానం, సాంకేతిక వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించిన సమాచార సేకరణ, ముందస్తు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే అసత్య ప్రచారాలు, వదంతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటి పై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఐటీ కోర్ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో సాధిస్తున్న పురోగతిని తెలుసుకున్నారు. సీసీటీవీ విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, డేటా అనాలిసిస్, సైబర్ నేరాల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డీసీఆర్బీ కార్యాలయంలో నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, వారెంట్లు, నిందితుల వివరాలు, నేర విశ్లేషణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డు నవీకరించబడేలా చర్యలు తీసుకోవాలని, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ ఆర్. భాస్కరన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### వర్షాలు కురవాలి

# రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలి

### -రాష్ట్ర ఎస్సీ, ఎసీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 25 :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొండగట్టు హరిత హోటల్కు చేరుకున్న చైర్మన్కు అదనపు కలెక్టర్ బి.ఎస్. లత పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదుపరి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న చైర్మన్కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు బాగా పండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది -2లో

# రాష్ట్ర మంత్రి అడ్లూరికి మరో కీలక బాధ్యత

### -ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లు కమిటీ సభ్యునిగా నియామకం



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 25 :** తెలంగాణలో సామాజిక న్యాయం కోసం కృషిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం నియమించింది. ఈ మేరకు సాధారణపరిపాలన కేబినెట్ శాఖజి.ఓ.ఆర్.టి.నెం.1077ను ప్రభుత్వం జారీ చేసింది. సుప్రీంకోర్టు ఏడుగురున్యాయ మూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపైఇచ్చినచారిత్రాత్మక తీర్పునేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్య యనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితుల పై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింతబలం చేకూర్చ నుంది.అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారం గా వివక్షను నిరోధించే లక్ష్యం తో రూపొందిస్తున్న రోహిత్ వేముల రాష్ట్రఉన్నతవిద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక బిల్లు--2026 కు సంబంధించిన శాసన రూప కల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో అడ్లూరికి సభ్యత్వం కల్పించింది.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలన కేంద్ర బిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ,సమాన అవకా శాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన,న్యాయ సమ్మత మైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, ఉన్నత విద్యాసంస్థల్లో -2లో

## మంథని ముత్తారం సమగ్ర ఓటర్ ప్రత్యేక సవరణ ఇన్చార్జిగా గాండ్ల మోహన్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 25 :** ముత్తారం మండలం సమగ్ర ఓటర్ ప్రత్యేక సవరణ ఇంచార్జి గా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ను పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ నియమించడం జరిగింది.ఏఐసీసీ ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమాన్ని దేశంలోనే ప్రతిష్టాత్మకంగా తీసుకొని అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొని పార్టీ బి ఎల్ ఏ లు కార్యక్రమంలో పాలుపంచుకొని బూతులోని ఓటర్లు ప్రభుత్వం ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించి ఫారమ్స్ నింపి ఆన్లైన్ చేయడంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు నాయకులు కార్యకర్తలు బిఎల్ఎలు పాలుపంచుకొని 100% ఈ ప్రోగ్రాం ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఇన్చార్జిలింగ్ నియమించడం జరిగింది తనకు కల్పించిన ఈ అవకాశం పట్ల పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తానని వారికి కృతజ్ఞతలు తెలిపారు. కో ఇన్చార్జిలు గా కుందారపు బాపు మరియు శివ శంకరయ్య కాల్వ శ్రీరాంపూర్ మండలం కటకం రవీందర్ రామగిరి మండలం ఇన్చార్జిగా వేయడం జరిగింది.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత విజయం

**-పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 25 :** ఇటీవల నీట్ పరీక్ష లీక్ తో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని యువత ఒక్కసారి దేశంలో ఆందోళనకు దిగింది భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం నీటి పరీక్ష లీకేజ్ తో పరీక్షను రద్దుచేసి చేతులు దులుపుకున్న వైనాన్ని యువత ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేసి ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ కేంద్ర మంత్రిని రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం జరిగింది యువత చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వడంతో ఒక్కసారి దేశంలో యువత రాహుల్ వైపు చూస్తున్న అని కేంద్ర ప్రభుత్వం చేరుకొని ధర్మేంద్ర ప్రధాని రాజీనామా చేయించడం ఇది యువత విజయంగా భావిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ అన్నారు దేశంలోని దాదాపు ప్రతిపక్ష పార్టీలన్నీ విద్యార్థుల వెంట నడవడం జరిగిందని ఇలాంటి విజయాలు భవిష్యత్తు తరాలకు ప్రభుత్వాలు జవాబుదారితనంగా పనిచేయడం జరుగుతుందని ఆయన అన్నారు రాబోవు కాలంలో ఒక జమిలి ఎన్నికల కోసమే బిజెపి ప్రభుత్వం చట్టం చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని ఇటువంటి పరిణామాలు జరగకుండా బిజెపి కేంద్ర ప్రభుత్వం చూడాలని అవసరమైతే తప్పిదాలు చేసిన వారిని రీ కాల్ చేసే పద్ధతిని రిఫరెండం విధానాన్ని చట్టం చేసి రాజ్యాంగబద్ధంగా అమలు చేసే విధంగా చూడాలని ఆయన అన్నారు.

## వర్షాలు కురవాలి...

**మొదటి పేజీ తరువాయి....** మంది భక్తులు దీక్షలు తీసుకుని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, డీఎస్పీ రాములు, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, ప్రవీణ్, నీలాదేవి, రాంబాబు, శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కిషోర్, డి.పి.ఆర్.ఆర్. వి.శ్రీధర్, తహసీల్దార్, ఈఓ అంజనా రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ అధికారులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 వరకు రోళ్లవాగు ప్రాజెక్టుకు షెట్టర్ల ఏర్పాటు

**-ఇరిగేషన్ సమీక్షలో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి.అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 25 :** ఆగస్టు15వ తేదీలోపు రోళ్ల వాగుప్రాజెక్టుషెల్టర్లు ఏర్పాటు చేసి ప్రాజెక్టులో నీటి నిలువ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై శనివారం హైదరాబాదులో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు ధర్మపురి నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా ఇరువురు మంత్రులు అధికారులతో చర్చించి పలుకీలక నిర్ణయాలు తీసుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్ళవాగు ప్రాజెక్టులో 0.25 టీఎంసీల నీటిని నిలువ చేయడంతో పాటు, ప్రాజెక్టు కాలువల పూడికతీత పనుల అంచనాలు తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులు ఆరు నెలల లోపు పూర్తి చేయాలని 2027 జనవరి చివరి కల్లా అక్కపల్లి ఎత్తిపోతల పథకం నుండి రైతులకునీరు అందించే విధంగాపనులు వేగవంతం చేయాలని,వెల్గటూర్ మండలం జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులు,గొల్లపల్లి మండలంలో యశ్వంత్‌రావు పేట, రంగధాముని పల్లి చెరువు ఊడికతీత పనుల అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

**నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించిన మంత్రి అడ్లూరి**

ధర్మపురి మండలం నక్కల పేట గ్రామంలో నూతనలిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేసి సాగు నీటిని అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించగా, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.ధర్మపురి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించడంతో ధర్మపురి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి చేస్తాం.. మంత్రి అడ్లూరి**

ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టు లను పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి తెలిపారు.నియోజక వర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామ ని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వ కాలంతో కమీషన్ల కోసం మాత్రమే ప్రాజెక్టుల పనులు చేశారని తాము రైతులకు సాగునీరు అందిం చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతూ పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి తెలిపారు.

# కేంద్ర మంత్రి రాజీనామా చేయడం యువత, నీట్ విద్యార్థుల విజయం

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య**



**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డి పేట జూలై 25 :** కేంద్ర మంత్రి ధర్మాన ప్రధాన్ రాజీనామా చేయడం యువత, నీట్ విద్యార్థుల విజయమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య మాట్లాడుతా నిన్న హైదరాబాద్ లో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సైతం మద్దతు తెలిపి... విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర మంత్రి ధర్మాన ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని ఆయన గుర్తు చేశారు.కేంద్ర మంత్రి ధర్మాన ప్రధాన్ నీట్ పేపర్ కు నైతిక బాధ్యత వహించి వహించ డాన్ని స్వాగతిస్తున్నామన్నారు.మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కేటీఆర్ పై అవాకులు,చెవాకులు పేలడం , విమర్శలు చేయడం మానుకోవాలని హితువు పలికారు.ఒక వైపు కొడుకు కేసు, మరో వైపు కరీంనగర్ లో వరుస భారీ చోరీలు జరగడంతో ..ఏం చేయాలో .తెలియక కేటీఆర్ పై విమర్శలు చేయడం సిగ్గు చేటుఅన్నారు. ఇప్పటికయినా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లుగానే , బండి సంజయ్ కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాబోయే రోజుల్లో బండి సంజయ్ పై కూడా ఆందోళనలు చేస్తారని, తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.నిన్న ఇందిరా పార్క్ లో నీట్ విద్యార్థులకు మద్దతుగా బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ చేపట్టిన ధర్నా కు తరలి వచ్చిన యువతకు, యూత్ నాయకుల కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, న్యాల కొండ రాఘవ రెడ్డి, కంబాల మల్లారెడ్డి ,గుండ్లపల్లి పూర్ణ చందర్ , మ్యాన రవి, అడిచెర్ల సాయి, బూర బాలు, గంట్యాల శ్రీనివాస్, వేముల రాములు,లింగంపల్లి మధుకర్, పంగ రవి, కొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర మంత్రి అడ్లూరికి మరో కీలక బాధ్యత

**మొదటి పేజీ తరువాయి....** విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల అమలు కు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతుందని మంత్రి పేర్కొన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్ప నలో ఆయన పాత్ర మరింత బలోపేతంకానుంది.ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయంసాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అడ్లూరి అభిప్రాయం వ్యక్తం చేశారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం

**ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు**




**చురుకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 25 :** ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన వాసరవేణి దేవయ్య దంపతులు తమ ఇంటిలో శనివారం ఉదయం వంటగదిలో గ్యాస్ లీక్ అయ్యి పెను ప్రమాదం నుంచి తృటిలో ప్రాణాలతో తప్పించుకున్నారు వంటలు చేసుకునే క్రమంలో గ్యాస్ సిలిండర్ నుండి రెగ్యులేటర్ వేరు చేస్తుండగా ప్రమాద వశస్తు గ్యాస్ లీక్ అయ్యింది, దీంతో గ్యాస్ ఇల్లంతా వ్యాపించడంతో పూజ గదిలో ఉన్న దీపంతో మంటలు వ్యాపించాయి అట్టి మంటల్లో వాసరవేణి దేవయ్య అతని భార్య మంటల్లో చిక్కుకొని గాయాలపాలు అయ్యారు, ఇరువురు మంటలు అంటుకోవడంతో అతి చాకచక్యంగా ఇంటి బయటకు పరుగులు తీసి తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు , లేకుంటే భారీగా ప్రాణం నష్టం జరిగి ఉండేది వెంటనే మంటల్లో చిక్కుకొని గాయపడిన భార్య భర్తలిద్దరినీ వారికుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు, వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు

## ఉన్నతాధికారులను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 25 :** జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, ఇంజనీర్ ఇన్ చీఫ్ భాస్కర్ రెడ్డిలను శనివారం కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవిని వారి కార్యాలయంలో కలిసి జగిత్యాల మున్సిపల్ పరిపాలన, పారిశుధ్య సిబ్బంది సంఖ్య తక్కువ ఉందని నూతన కార్మికుల నియామకం చేపట్టడానికి, స్టాంప్స్ డ్యూటీ ఆదాయంలో రూ.6 కోట్ల 13 లక్షలకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలపగా వాటికి అడ్మినిస్ట్రేషన్ ఆమోదం ఇవ్వాలని కోరారు. డైరెక్టర్ ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మున్సిపల్ ఈఎన్సీ భాస్కర్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి అమృత్ స్కీమ్ లో భాగంగా నీళ్ళ ట్యాంక్, వాటర్ పైప్ లైన్ లు, యూఐడిఎఫ్ లో టెండర్ లు వేసిన ఇంకా పనులు మొదలు కాలేదని, కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వరగా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలపగా వారు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తెలిపారు.

## ధర్మేంద్ర ప్రసాద్ రాజీనామా విద్యార్థుల ఐక్య పోరాటానికి నిదర్శనం

**-మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్**




**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 25 :** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ రాజీనామా విద్యార్థుల ఐక్య పోరాటానికి నిదర్శనమని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యక్తం చేసిన ఆగ్రహానికి ఫలితంగానే బాధ్యుడైన ధర్మేంద్ర ప్రసాద్ రాజీనామా చేయడం విద్యార్థుల ఉద్యమానికి దక్కిన గొప్ప విజయమన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని విద్యార్థులు చేసిన న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం మొదట నిర్లక్ష్యం చేసిందని, దేశవ్యాప్తంగా వచ్చిన తీవ్ర వ్యతిరేకత, విద్యార్థుల నిరసనలు, ప్రజాసంఘాల ఒత్తిడి నేపథ్యంలో ఈ రాజీనామా అనివార్యమైందని, ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా మాత్రమే కాదని, విద్యార్థుల ఐక్యత, ప్రజాస్వామ్య పోరాటం ముందు అధికారంలో ఉన్నవారు కూడా తలవంచాల్సి వస్తుందనే విషయాన్ని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు. రాజీనామాతోనే బాధ్యత ముగిసినట్లు కేంద్ర ప్రభుత్వం భావించకూడదని, పరీక్షల వ్యవస్థలో జరిగిన అవకతవకలపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి, బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శక విధానాలను అమలు చేయాలని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలుస్తుందని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడే ప్రతి న్యాయమైన ఉద్యమానికి మద్దతు ఇస్తుందని, విద్యార్థుల కష్టార్జిత భవిష్యత్తును రాజకీయాల కోసం బలిపశువుగా మార్చే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

# రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ సర్వే కాలేదు

**-ఇబ్రహింపట్నం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (25) :** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం,అలసత్వం కారణంగానే పలువురు రైతుల భూముల సర్వేలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని అమ్మకపేట గ్రామంలో నిర్వహించిన భూ సర్వే గ్రామసభలో తహశీల్దార్ వరప్రసాద్ సమక్షంలో మాట్లాడుతూ సర్వే నంబర్లు 48, 49లో జిల్లపల్లి రాజయ్యకు చెందిన 2 ఎకరాల 10 గుంటల భూమి సర్వే కోసం 2023 సంవత్సరం నుంచే మండల సర్వే కార్యాలయం,డివిజన్ సర్వే కార్యాలయాలకు పలుమార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. భూమి సర్వే నిర్వహించాలని పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా, చలానాలు చెల్లించినా ఫలితం లేకుండా పోయిందని,రైతులు తమ భూముల హక్కులను కాపాడుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. భూమి సర్వే ఆలస్యం కావడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూ వివాదాలు పెరిగి సాగు పనులపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని భాస్కర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ధారించడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఈ కార్యక్రమం ద్వారా న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. గ్రామస్థుల సమక్షంలో జరిగిన ఈ గ్రామసభలో పలువురు రైతులు తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సిజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**-జగిత్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (25) :** సిజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. జగిత్యాల జిల్లాలోని ఆకస్మికంగా లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇబ్రహీంపట్నం మండల ఆరోగ్య క్రేంధ్రన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. గ్రామాల్లో తిరిగే క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దోమల ద్వారా వచ్చే మలేరియా,డెంగ్యూ, చికెన్‌గునియా, ఫైలేరియా వంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా ఇంటి చుట్టుపక్కల అనవసరంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలనిలి, కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ సామాన్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. వారంలో ఒకసారి డ్రై డే పాటించి నీటి నిల్వలను తొలగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జ్వరం లక్షణాలు



కనిపించిన వెంటనే సమీపంలోని పిహెచ్ సి/సి హెచ్ సి లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని,స్వీయ వైద్యం చేసుకోవద్దని డాక్టర్ సుజాత కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర, వైద్యాధికారి వనజ, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "డ్రగ్ ఇన్స్పెక్టర్ గారు.. హుజురాబాద్ పై దృష్టి పెట్టండి"

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 25 :** హుజురాబాద్ లో మెడికల్ షాపులపై డ్రగ్స్ నియంత్రణ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడ నకిలీ మందుల విక్రయాలు, నాణ్యతలేని మందుల విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. నాణ్యత లేని మందులను విజయవాడ విశాఖపట్నం ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తక్కువ ధరకు తెప్పించి రోగులకు అంటగడుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్లు ఒక రకమైన మందులు రాస్తే అవి లేవంటూ.. డాక్టర్ రాసినవి మీకు ఇచ్చేవి ఒకటే.. వాటి ఫార్ములా ఒకటే.. కానీ.. కంపెనీ వేరు అని చెబుతూ.. నాణ్యతలేని మందులను రోగులకు అంటగడుతున్నారు. అలాగే రోగులకు అధిక ధరలకు విక్రయిస్తూ రసీదులు మాత్రం ఎక్కడా ఇవ్వడం లేదు. హనుమకొండ కరీంనగర్ లాంటి ప్రాంతాల్లో ప్రింటెడ్ రిసీట్లు ఇస్తుండగా




హుజురాబాద్ లో మాత్రం ఒకటి రెండు బ్రాండెడ్ మందుల దుకాణాల్లో తప్ప ఇతర దుకాణాల్లో ఎక్కడ రసీదులు ఇవ్వడం లేదు. నిరక్షరాస్యులైన రోగులకు మందులపై సరైన అవగాహన లేక మెడికల్ షాపులు ఇచ్చినవి అసలైన మందులని నమ్ముతూ మోసపోతున్నారు. రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయలు మెడికల్ షాప్ లో యజమానులు సంపాదిస్తున్నారు. కొంతమంది మెడికల్ షాపుల యజమానులు తక్కువ సమయంలోనే కోట్లాది రూపాయలు ఆర్జించారు. కాగా కొంతమంది మెడికల్ షాపుల యజమానులకు మందులపై అవగాహన లేకున్నప్పటికీ.. ఇతరుల నుండి ఫార్మసీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి వారి పేరుపై మెడికల్ షాపులు నడుపుతున్నారు. నిజానికి ఆ లైసెన్సు పొందిన వ్యక్తులు ఏనాడు మెడికల్ షాపులో కనిపించరు. పలు దుకాణాల్లో ఎక్స్పైరీ అయిన మందులు కూడా ఉంటున్నాయి. మెడికల్ షాపులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎప్పుడు వస్తున్నారు ఎప్పుడు తనిఖీలు చేస్తున్నారు అన్నది తెలియడం లేదు. ఇప్పటివరకు కనీసం ఒక్క దుకాణాన్ని కూడా సీజ్ చేసిన తనిఖీ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. తాము అధికారులకు నెలనెలా మామూలు ఇస్తున్నామని.. తమకేమీ కాదని.. తమను ఎవరు ఏమీ చేయలేరని.. ఇందిరా మార్గంలోని ఓ మెడికల్ షాపు యజమాని బహిరంగంగానే చెప్తున్నాడు. ఇప్పటికైనా నాణ్యతలేని మందులు విక్రయిస్తూ రోగులను మోసం చేస్తున్న మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్స్పెక్టర్ కొరడా ఝులిపించాల్సి ఉంది.

## వెల్గటూర్‌లో “నేను సైతం” కార్యక్రమం

**-రహదారి ప్రక్కన సీసీ కెమెరాల ఏర్పాటు**




**చురకలు విలేకరి, వెల్గటూర్, జులై 25** : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో పోలీసుల "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా శనివారం వెంకటసాయి ట్రేడర్స్ సహకారంతో దుకాణం ఎదుట రాష్ట్ర రహదారి స్పష్టంగా కనిపించే విధంగా రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ ఆదేశాలు, డిఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనతో ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సి ఐ రాంనర్సింహారెడ్డి స్పష్టంచేశారు.వ్యాపార,వాణిజ్య,దుకాణ యజమానులు తమ దుకాణాల ఎదుట రహదారులు కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అసాంఘీక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు నేరస్థులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని వివరించారు. పోలీసుశాఖ ద్వారా చేపడుతున్న"నేనుసైతం"కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి,నేర రహిత సమాజ నిర్మాణంలో భాగ స్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యాపారులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**- ఇబ్రహీంపట్నం మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



**చురకలు విలేకరి,ఇబ్రహీంపట్నం జూలై 25** : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో శనివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ఉపవాస దీక్షలతో స్వామివారిని దర్శించుకున్నారు.మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండ, యామాపూర్, ఫక్ కోండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్,ములరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, డబ్బ,అమ్మకపేట్, ఎర్రాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాల్లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, రామాలయం, అంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.ఆలయాలను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు హరినామ సంకీర్తనలు, భజనలు చేస్తూ స్వామివారిని సేవించారు.వర్షకొండ గ్రామంలోని ఉగాది గుట్ట వద్ద వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి చాలా పవిత్రమైనదని,ఈ రోజున ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని పూజిస్తే సకల పాపాలు తొలగిపోతాయని పూజారులు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, జూలై 25** : జలసిరి కార్యక్రమ అమలులో భాగంగా ఇంకుడు గుంతలు, పంట కుంటల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. శనివారం మండలంలోని రంగారావుపేట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి జలవనరులను, నర్సరీని పరిశీలించారు. జలసిరి కార్యక్రమ అమలులో ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోర్ వెల్ రీచార్జ్, ఊటకుంటలను గుర్తించాలని, ఇప్పటికే గుర్తించిన వాటిని త్వరత్వరగా పనులు మొదలు పెట్టాలని గ్రామాధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం బాలరాజ్, ఉప సర్పంచ్ కేశవేణి పెద్ద రాజన్న, వార్డ్ సభ్యుడు సుదవేణి రాజు, కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో భూ సర్వేకు రైతులు సహకరించాలి

**-ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వరప్రసాద్**




**చురకలు విలేకరి,ఇబ్రహీంపట్నం జూలై 25 :** ప్రభుత్వం చేపడుతున్న భూ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని జగిత్యాల ఇబ్రహీంపట్నం మండల తహశీల్దార్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలం లోని అమ్మకపేట్ గ్రామం లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన రికార్డులను కచ్చితంగా నమోదు చేయడం, భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా చేయడం,రైతుల భూ హక్కుల ను పరిరక్షించడం లక్ష్యంగా ఈసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భూసర్వే ప్రక్రియలో రైతులు తమ భూముల హద్దులను చూపిస్తూ అవసరమైన పత్రాలను అధికారులకు అందజే యాలని సూచించారు.భూ రికార్డుల ఖచ్చితత్వం కోసం రైతుల సహకారం ఎంతో అవసరమన్నారు.సర్వే సమయం లో రైతులు స్వయంగా హాజరై తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని,ఏవైనా అభ్యంత రాలు లేదా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. భూముల రికార్డుల పారదర్శకత, రైతుల హక్కుల రక్షణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింద న్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ కాశిరెడ్డి బస్వర్ రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, ఆర్ ఐ రమేష్,పంచాయతీ కార్యదర్శి సరిత, జిపిఓ నాగరాజు, సర్వే రమేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**-నేరెళ్ల గ్రామంలో పోలీసుల అవగాహన**

**-సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామ భద్రత బలోపేతం**

**-ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి**



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 25 :** గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎలపాటి రాంనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలం నేరెళ్ల గ్రామంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ.రాం నర్సింహారెడ్డి, ధర్మపురి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గురుక మహేష్తో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల నివారణ చర్యలు, సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలపై ప్రముఖమైన ఉదాహరణలతో ప్రజలకు సమగ్రంగా వివరించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఆన్లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో నేరెళ్ల గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతా మని తెలిపారు.పోలీసుశాఖ సూచించిన భద్రతా చర్యలను గ్రామంలో అమలు చేసేందుకు పూర్తి సహకారం అందిస్తా మని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సభకు హాజరైన గ్రామ పెద్దలు, కుల పెద్దలు, వార్డు సభ్యులు, ప్రముఖులు మరియు ప్రజలు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు తమపూర్తి మద్దతు ప్రకటించారు.గ్రామ భద్రత, యువత భవిష్యత్తు మరియు సైబర్ నేరాల నివారణ కోసం పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలనుప్రజలు అభినందించారు.

## ఎన్ హెచ్-563 భూసేకరణ బాధిత రైతులకు ఆర్బిట్రేషన్ విచారణ



**-హాజరైన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 25 :** జాతీయ రహదారి ఎన్హెచ్-563 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన ఆర్బిట్రేషన్ విచారణను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. పూడూర్ (31), నమిలికొండ (17), జగిత్యాల (10), చల్ గల్ (09), రాజారం (19), నూకపల్లి (17), పోతారం (13), ముత్యంపేట (46) గ్రామాలకు చెందిన భూసేకరణ బాధితుల పరిహారానికి సంబంధించిన మొత్తం 162 మంది అవార్డుదారుల కేసులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భూమి యజమానులు, వారి తరపున న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా, సంబంధిత అధికారులు అవసరమైన వివరాలను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ విచారణకు హాజరై సంబంధిత అంశాలపై వివరణ ఇచ్చారు. బాధిత రైతుల అభ్యర్థనలు, రికార్డులు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కలెక్టరేట్ జీ-సెక్షన్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, న్యాయవాదులు, భూసేకరణ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



**చురకలు విలేకరి,కొడిమ్యాల,జూలై 25 :** ఎల్‌నినో ప్రభావంతో వివిధ పంటలలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు, ప్రస్తుతం సాగు చేయాల్సిన పంటల పై శనివారం కొడిమ్యాల మండలంలోని డబ్బు తిమ్మైపల్లి, నాచు పల్లి గ్రామాలలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర, కోఆర్డినేటర్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డా.ఎ.విజయ్ భాస్కర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భం గా వరి నర్సరీ,ప్రత్తి,పసుపు, మొక్కజొన్న విత్తిన పొలాలలో క్షేత్ర సందర్శనలు నిర్వహించారు.రైతులకు ఆయా పంటల లో అనుసరించాల్సిన సాగు యాజ మాన్య పద్ధతులపై అవగాహన కల్పిం చారు.వరి నాట్లు వేసేటప్పుడు కాలి బాటలు నిర్వహణతోపాటు,ముదిరిన మొక్కలపై భాగాన్ని కత్తిరించడం ద్వారా మంచి పెరుగుదల మరియు చీడపీడల నియంత్రణ సాధ్యమవుతుందని వివరించారు.పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి గమనించగా,వాటి నివారణకు ఏసిఫేట్ 1.5గ్రా.క్లోరో పైరిఫాస్ 2.0మి.లీ.మందుల ను వేపనూనె 5మి.లీ.తో 1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని,మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోట్ 0.4గ్రాము మందును 1లీటర్ నీటిలో కలిపి పిచి కారీ చేయాలనిసూచించారు.లింగా రసక బుట్టలను 8ఒక ఎకరాకు పెట్టాల ని రైతులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావం ఉండటంతో ఆరుతడి, చిరు ధాన్యాలు,ఆయిల్ పామ్ కూరగాయ పంటలు సాగు చేయాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్రీలత, మాజీ ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, నర్సయ్య,అమర్నాథ్ రెడ్డి,రవి, శ్రీని వాస్,అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# వాసవి స్కూల్‌లో పేరెంట్ ఓరియంటేషన్



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 25 :** వాసవి ప్రైమరీ స్కూల్‌లో ప్రీ-ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ప్రత్యేక పేరెంట్ ఓరియెంటెడ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త, శిక్షణ నిపుణుడు, పాఠ్య ప్రణాళిక రూపకర్త శ్రీ కె. వేణుగోపాల్ రెడ్డి ముఖ్య వక్తగా పాల్గొన్నారు. 26 సంవత్సరాలకు పైగా విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన కె. వేణుగోపాల్ రెడ్డి, వి4సి ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు మరియు నిర్వచన్ -- ద ఫ్యూచర్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు. ఆయన ఎన్ ఇ పి.2020 మరియు ఎన్ సి ఎఫ్- ఎఫ్ఎస్ 2022 మార్గదర్శకాల ఆధారంగా ఆనందదాయకమైన, విద్యార్థి-కేంద్రిత అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో పాఠశాలలు, ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్నారుల అభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కథలు, ఆటలు, పాటల ద్వారా పిల్లల్లో సహజమైన ఆసక్తి, సృజనాత్మకత, విలువలు మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వివరించారు. తన “కహానీ--ఖేల్--గానా” విధానం ద్వారా పిల్లలకు ఆనందభరితమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు చిన్నారుల సమగ్ర అభివృద్ధి, ఇంట్లో అనుసరించాల్సిన అభ్యాస పద్ధతులు, డిజిటల్ యుగంలో పిల్లల పెంపకం వంటి అంశాలపై విలువైన సూచనలు పొందారు. కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా సాగి తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ జగదీష్ రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపల్ సుహాసిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# వ్యాయామం పోలీసులకు తప్పనిసరి : ఎస్పీ



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 25 :** ఈ రోజు నిర్మల్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్డ్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీక్లీ పరేడ్ వల్ల పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం పెరగడం తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవ డానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విధుల మధ్య సమయం దొరికినప్పుడల్లా వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, ఫిట్నెస్‌ను నిరంతరం కాపాడుకోవడం ద్వారా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చు కోవాలని సూచించారు.వ్యక్తిగత, ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడాలని, క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించు కోవాలని సూచించారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకొని, సమయం దొరికినప్పుడు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడు కోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, రవీందర్, సత్యనారాయణ, దీపక్, కృష్ణ, సమ్మయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామ్ నిరంజన్ రావు, శేఖర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు పెంచండి ఆరోగ్యాన్ని పంచండి



## -సామాజిక కార్యకర్త, మొక్కల ప్రేమికుడు దుంపెన రమేష్

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 25 :** ప్రతి ఒక్కరు మొక్కలు పెంచాలి,అందరికీ ఆరోగ్యం పంచాలని ఎల్లారెడ్డిపేటకు చెందిన సామాజిక కార్యకర్త,మొక్కల ప్రేమికుడు దుంపెన రమేష్ కోరారు.శుక్రవారం తన ఇంటి ముందు ఉన్న పలు రకాల మొక్కలను పలువురికి పంపిణీ చేశారు.దానిమ్మ, గన్నేరు,తులసి,అల్ల నేరేడు,వేప,ఖర్జూర, చీమ తంగేడు, సత్యనారాయణ మొక్కలను పంపిణీ చేసిన దుంపెన రమేష్ ఇప్పటి వరకు 65వేల వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు.2011లో మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన ఆయన పర్యావరణ పరిరక్షణకు 15ఏళ్లుగా మొక్కలను పంపిణీ చేస్తూ వాటిని నాటి సంరక్షించాలని కోరుతున్నారు.మొక్కలు నాటడం అందరి బాధ్యత అని,చెట్ల తో లభించే స్వచ్ఛమయిన గాలి,ఆక్సిజన్ తో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.మొక్కలు కావలసిన వారు తన ఇంటి ఎదుట నున్న మొక్కలను తీసుకు వెళ్ళవచ్చని దుంపెన రమేష్ తెలిపారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 25 :** కమాన్ పూర్ మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆది వరహస్వామి వద్ద ఉదయం నుండే భక్తులు బారులు తీర్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంతరెడ్డి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. స్వామివారిని మంథని జడ్జి అపర్ణ, స్థానిక తహసిల్దార్ ముస్త్యాల వాసంతి దర్శనం చేసుకున్నారు. అలాగే గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. తమత మహిళలు తీపి వంటకాలు చేసుకొని ఉదయం నుండే ఉపవాస దీక్షలు చేశారు. తులసి విష్ణు సహస్ర పారాయణం భగవద్గీత పారాయణం నిర్వహించారు. అలాగే భక్తులు శ్రీ ఆది వరహస్వామి వద్ద వైకుంఠ ద్వార దర్శనం నిర్వహించుకున్నారు. ఉదయం నుండి ఉపవాస దీక్షలు చేసిన భక్తులు మలసటి రోజు ద్వాదశి ఘడియలు ఉపవాసం వీడనున్నారు. ఉదయం నుండే గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

# ఎస్సీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ





**చురకలు ప్రతినిధి,మంథని,జులై 25 :** జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం మంథని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీరు, పరిశుభ్రత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, బిల్లులతో సహా పలు రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో ఎలాంటి లోపాలు లేకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సకాలంలో అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారులు తిరుపతి, రమేష్ లకు తగు సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారం, క్రమం తప్పకుండా మెనూ పాటించాలని, విద్యార్థుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం రాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రవీందర్ సూచించారు.

# శ్రీవారి ఆలయానికి పోటెత్తిన జనం..

## -ముక్కోటి ఏకాదశి సందర్భంగా..దర్శించుకున్న 10వేల మంది భక్తులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 25 :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ లక్ష్మీనారాయణ సమేత సుదర్శన హోమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకించారు. ఇవాళ వేకువ జాము నుండి మండలంలోని ఆయా గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. సుమారు పదివేల మందికి పైగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. ఇటీవల రాతితో కొండపై ఆలయాన్ని నూతనంగా నిర్మించిన సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలోవచ్చి దర్శనం చేసుకున్నారు.భక్తులు ఆలయం ముందు అత్యుత్సాహంగా సెల్ఫీలు దిగారు.శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి.ఈ సందర్భంగా ఏ.ఎం.సి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి గుండాడి వెంకట్రెడ్డి మద్దుల చంద్రారెడ్డి గంట రమేష్ గౌడ్ తదితరులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



## గ్యాస్ లీక్ అయ్యి భార్యాభర్తలకు గాయాలు

**-తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**-ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 25 :** ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన వాసరవేణి దేవయ్య దంపతులు తమ ఇంటిలో శనివారం ఉదయం వంటగదిలో గ్యాస్ లీక్ అయ్యి పెను ప్రమాదం నుంచి తృటిలో ప్రాణాలతో తప్పించుకున్నారు.వంటలు చేసుకునే క్రమంలో గ్యాస్ సిలిండర్ నుండి రెగ్యులేటర్ వేరు చేస్తుండగా ప్రమాద వశస్తు గ్యాస్ లీక్ అయ్యింది.దీంతో గ్యాస్ ఇల్లంతా వ్యాపించడంతో పూజ గదిలో ఉన్న దీపంతో మంటలు వ్యాపించాయి అట్టి మంటల్లో వాసరవేణి దేవయ్య అతని భార్య మంటల్లో చిక్కుకొని గాయాలపాలు అయ్యారు.ఇరువురు మంటలు అంటుకోవడంతో అతి చాకచక్యంగా ఇంటి బయటకు పరుగులు తీసి తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు.లేకుంటే భారీగా ప్రాణం నష్టం జరిగి ఉండేది వెంటనే మంటల్లో చిక్కుకొని గాయపడిన భార్య భర్తలిద్దరినీ వారి కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య

**-గాలింపు చర్యలు చేపట్టిన జాలర్లు**



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,జులై 25 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగు బ్రిడ్జిపై నుండి శుక్రవారం రాత్రి పల్లపు భూమేష్ 32 అనే వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఊట్నూర్‌కు చెందిన పల్లపు భూమేష్ అనునతను అత్తగారి ఊరు చొప్పదండికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వెల్గటూర్ వద్దగల పెద్దవాగులో బ్రిడ్జి పైనుండి దూకి ఆత్మ హత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. శుక్రవారం రాత్రి సమయంలో ఈ సంఘటన జరుగగా శవం తేలక పోవడంతో జాళరులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇతనికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. విషయం తెలిసిన అతని భార్య కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తు న్నారు.ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు సంఘటన స్థలాన్నిపరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్,జూలై 25 :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుని మండలంలోని బండలింగాపూర్ గ్రామాల్లో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మాధవ చార్యులు గుడిలో గోపాల కాలువల పూజ కార్యక్రమ ఘనంగా జరుపగా రైతులు వర్గాలు కూరవాలని కోరుతూ ప్రత్యేక పూజ అర్చనలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి సంజీవ ",ఉపసర్పంచ్ రాకేష్ పటేల్, వీడీసీ చైర్మన్ రాజేష్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**-పలు ఆలయాల్లో బారులు తీరిన భక్తులు**



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 25 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో శనివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. జగిత్యాల శ్రీ గుట్ట రాజేశ్వ స్వామి ఆలయ సమీపంలో నెలకొన్న శ్రీ లక్ష్మీ గోదాదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, భజన, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. ఆలయ పక్షాన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాంసాని మహేష్, పడకండి శ్రీనివాస్, సురేష్, శ్రీకాంత్, భూమయ్య, రాజు పాల్గొన్నారు.

# క్షణికావేశంతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

**-రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి**



**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్,జూలై 25 :** కుటుంబ కలహాల వల్ల అవే షాలకు లోనయి తమ విలువైన జీతం నాశనం చేసుకోవద్దని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి హితవు చేశారు.శనివారం ఉదయం కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్షేడు గ్రామానికి చెందిన వివాహిత నేతి మానస (23), కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు తనకు ఫోన్ ద్వారా సమాచారం అందగానే వెంటనే స్పందించి తన బ్లూ కోల్ట్ సిబ్బంది పీసీ అఫ్జల్,హోంగార్డ్ ప్రసాద్‌లను సంఘటనా స్థలానికి పంపించారు.వారు వెంటనే దర్శేడ్ గ్రామానికి చేరుకుని మహిళను నిప్పంటించుకోకుండా అడ్డుకుని,ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.ఆమెకు ఒక పాప ఉంది.ఒక మహిళ ప్రాణాన్ని పోలీసులు సకాలంలో స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడినందుకు కరీంనగర్ రూరల్ మండలం ప్రజలు హర్షం వ్యక్తం చేసినారు.పోలీసు సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడినందుకు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, కానిస్టేబుల్ అబ్జల్ , హోంగార్డు ప్రసాద్ లను ఏసిపి శ్రీ విజయ కుమార్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం అభినందించారు.ప్రజలు కుటుంబ సమస్యలు లేదా వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితుల, పోలీసులను సంప్రదించాలని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ సూచించారు.

### అంతర్జాతీయ వేదికపై ప్రశంసలు పొందిన

# 'ఫెర్టీ9' వరంగల్ ఫెర్టిలిటీ సెంటర్



**చురకలు ప్రతినిధి, హనుమకొండ, జూలై 25 :** ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ఫెర్టిలిటీ నెట్‌వర్క్‌గా పేరుపొందిన 'ఫెర్టీ9' అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు సాధించింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ ప్రసిద్ధ సదస్సుల్లో ఫెర్టీ9 క్లినికల్ బృందం తమ పరిశోధనా పత్రాలను సమర్పించి, తెలంగాణ వైద్య రంగానికి గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... సంతాన లేమితో బాధపడుతున్న దంపతుల కోసం 'నీడిల్-ఫ్రీ IVF' విధానాన్ని తమ 11 కేంద్రాల్లో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఇది రోజువారీ ఇంజెక్షన్ల వల్ల కలిగే నొప్పి, ఆందోళనను తగ్గిస్తుందని చెప్పారు. ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడానికి, ఇంప్లాంటేషన్ వైఫల్యాలను నివారించడానికి కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత పరిశోధనలు వేగవంతం చేశారు.పదే పదే గర్భస్రావాలు కావడం, చికిత్స వైఫల్యాలను నివారించడం లక్ష్యంగా త్వరలోనే ఒక ప్రత్యేక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 11 కేంద్రాల ద్వారా అత్యాధునిక వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యులతో ఫెర్టీ9 సేవలు అందిస్తోంది. వరంగల్‌లోని ఫెర్టీ9 సెంటర్ ద్వారా ఇప్పటికే వేలాది మంది దంపతులు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని పొందారని సంస్థ తెలిపింది.

## ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు,జలసిరి పై గ్రామ సభ



**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట జూలై 25 :** ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయము లో సర్పంచ్ ఎలగందుల నర్సింలు అధ్యక్షతన ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు , జలసిరి కార్యక్రమం పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ గారైన జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ బేగం గారు ఎల్ నినో ప్రభావం వల్ల మండలం లో సాధారణం కంటే 36% లోటు వర్షపాతం నమోదైనట్లు ,వరి నాట్లకు ఇది సరిపోదు కనుక ప్రత్యామ్నాయ పంటలైనా పెసర కంది రాగులు నువ్వులు కూరగాయలు ఆయిల్ పామ్ వంటి పంటల సాగు గురించి వివరించారు,రాగులు నువ్వుల విత్తనాలు TRVK వేములవాడ నందు అందుబాటులో ఉన్నట్లు రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వీణా సత్తయ్య మాట్లాడుతూ జల సిరిలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత , బోర్ బావి వద్ద రీచార్జ్ స్ట్రక్చర్స్, ఫామ్ పాండ్స్, ఊత కుంటాలను VBGRAM(G) కింద రైతులు నిర్మించుకోవాల్సిందిగా ఇట్టి అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాల్సింది గా కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయము ఆవరణ లో బోర్ వెల్ రీచార్జ్ పిట్ కి ముగ్గు పోయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబెర బేగంవైస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు దోమ్మటి నర్సయ్య, వార్డు సభ్యులు ఇతర ముఖ్య నాయకులు అట్లాగే MAO ,AE మిషన్ భగీరథ, AE ఇరిగేషన్,ఈఓ కృష్ణ, అధికారులు రైతులు పాల్గొనడం జరిగింది.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సమస్యలు



**-రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సైనీ**

**చురకలు ప్రతినిధి హైదరాబాద్, జూలై,25 :** టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సైనీ (ముజీబ్) రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లకు పదోన్నతులు కల్పించాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను కొనసాగించాలని అలాగే సాధారణ బదిలీలను తక్షణమే చేపట్టాలని మంత్రిని కోరారు.ఈ అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఎం.ఎ. ముజీబ్, ఎం.ఎ. ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ నేపథ్యంలో సందేశాత్మక చిత్రం "హే చికీతా"

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జులై 25 :** గ్రామీణ నేపథ్యంలో రైతుల కష్టాలు, యువత ఆశలు, ప్రేమ, ఫ్యామిలీ సెంటిమెంట్ను కలిపి అభినవ్ మణికంఠ, దివిజా, తణ్మయి హీరో, హీరోయిన్లుగా ఈటీవి ప్రభాకర్, అంజిమామ తదితరులు నటించిన సామాజిక సందేశంతో దర్శకుడు ధన్ రాజ్ లెక్కల తెరకెక్కిన చిత్రం హే చికీతా శుక్రవారం అన్ని రాష్ట్రాలలో విడుదల కావడంతో ప్రేక్షకులతో సినిమాహాల్లు కితకిటలాడుతూ సందడి ఏర్పడింది. ఈ సందర్భంగా జగిత్యాలకు చెందిన దర్శకుడు ధన్ రాజ్ లెక్కల ఈ సినిమాను సొంత ప్రాంతపు కథ, క్యారెక్టర్లతో తెరపైకి తీసురావడం తో



శనివారం వారి బృందంతో జగిత్యాల కు విచ్చేసి బాలాజీ థియేటర్ సినిమా చూసి ప్రేక్షకులకు మధ్య కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. గత రెండు రోజులుగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు సినిమాలోని సెంటిమెంట్ సీన్స్కు కనెక్ట్ అవుతున్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ధన్ రాజ్ లెక్కల, నటులు జబర్దస్త్ అజయ్, క్రాంతి, పోలీస్ మల్లయ్య, రాపర్తి రవి తో పాటు జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, ఐజేయు జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేనేని రవీందర్ రావు, తెలంగాణ శక్తి ఎడిటర్ కాంతారావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. కేక్ కటింగ్తో సంబరాలు బాలాజీ థియేటర్ వద్ద చిత్ర బృందం టపాసులు కాల్చి, కేక్ కట్ చేసి విజయాన్ని జరుపుకున్నారు. అనంతరం ప్రేక్షకులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

# హుజురాబాద్‌లో.. కొవ్వొత్తుల ర్యాలీ

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జులై 25 :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు సంఘీభావం గా శనివారం హుజురాబాద్ పట్టణం లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు బండ శ్రీనివాస్,ముక్కెర రాజు,వెల్పుల రత్నం,సదానందం తదితరులు మాట్లాడుతూ..ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉద్యమించడం,వారి ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించడం హర్షనీయమని అన్నారు.ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.జెన్ జీలో రాజకీయ చైతన్యం వచ్చిందని, ఇక వారిని ఏశక్తి అడ్డుకోజాలదని అన్నారు.ఇకముందు ప్రజా ఉద్యమాలు వారే నిర్మిస్తారని నడిపిస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా పనిచేసేలా, ప్రజా సమస్యలు పరిష్కరించేలా జెన్ జీ ఒత్తిడి తెస్తుందని అన్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ తో చాలామంది విద్యార్థులు నిరాశతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో భవిష్యత్తులో ఇక మత రాజకీయాలు నడవవని ఢిల్లీలో జరిగిన ఉద్యమం గుర్తు చేసిందన్నారు. ఇకముందు పార్టీలు కూడా తమ పద్ధతు లను మార్చుకోవాలని,వ్యాపారాత్మక



ధోరణితో కాకుండా ప్రజా సమస్యలను అర్థం చేసుకోవాలని లేకుంటే మనుగడ సాధించడం కష్టమన్నారు.మతాల పేరుతో విభజించడం,అలాగే సమస్యల ను ప్రశ్నిస్తే ఎదురు దాడి చేయడం, సంఘవిద్రోహశక్తుల ముద్రవేయడం, దేశ వ్యతిరేకులుగా చిత్రీకరించడం ఇకముందు నడవదని అన్నారు. కచ్చితంగా ప్రజలకు యువతకు ప్రశ్నించే హక్కు ఉందని.. వారి గొంతు నొక్కేందుకు ప్రయత్నం చేస్తే విప్లవాలు వస్తాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**-అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**

**-స్వీయారక్షణార్థం కాలనిలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

**-సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జులై 25 :** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం ఉదయం సిరిసిల్ల డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను పోలీసులు



స్వాధీనం చేసుకుని,సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు.నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న కొక్కుల అంజనేయులుపై కేసు నమోదు చేసి, 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత ,సస్పెక్ట్ వ్యక్తులను తనిఖీ చేసి వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రస్తుతం వారు ఎలాంటి ఉపాధి చేస్తున్నారు.ఎక్కడ నివాసం ఉంటు న్నారు,అనే వివరాలను సేకరించి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడ కుండా ఉండాలని సూచించారు.ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనిలలో ఎవరైనా అనుమానాస్పదం గా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.ఈకార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు నాగరాజు, గణేష్, రంజిత్, ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న రామగుండం సిపి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జులై 25 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివరాహస్వామిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ శనివారం దర్శించుకున్నారు.ఆదివరాహస్వామిని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝ దర్శించుకోగా కుటుంబ సభ్యులను ఆయనను మర్యాద పూర్వకంగా పూర్ణకుంభ స్వాగతంతో వేదపండితుల ఆశీర్వచనల మధ్య స్వాగతం పలికారు.అనంతరం అభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివరాహ ఛైర్మన్ ముస్కాల దామోదర్‌మరియు డైరెక్టర్స్ బొజ్జ సతీష్,చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్,అనవేనశ్యామలసదయ్య,మరియు అర్చకులు రామానుజ చార్యులు,ఆలయ సిబ్బంది సన్మానించారు.

## కొత్తగట్టులో చెరువు ఆక్రమణకు యత్నం?



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ జులై 25 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని రామ్ చెరువు ఆక్రమణకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రామ్ చెరువు పై ఆధారపడి రైతులతో పాటు మత్స్యకారులు జీవిస్తున్నారు. అయితే వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువులోని భూమిని ఆక్రమిస్తున్నట్లు విమర్శలు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై రెవెన్యూ నీటిపారుదల శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలపై విచారణ చేసి ఆక్రమణదారులపై అలాగే చెరువులో మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు మత్స్యకారులకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఎంజేపీ గురుకులంలో డా. జైపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, జులై 25 :** మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను శనివారం జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత పరిశు భ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రంగా కడుక్కునే పద్ధతులను ప్రదర్శించి, పరిశుభ్రతతో అంటువ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డితో కలిసి పాఠశాల వంటశాల, భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు.

